## కుల వివక్ష పాటిస్తే చర్యలు తప్పవు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మర్కూక్, ఆగస్టు 29 : తెలంగాణలో నేటికీ కుల వివక్ష అంటరానితనం పాటించడం విచారకరమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య విచారం వ్యక్తం చేశారు. దళితులను తోటి మనుషులుగా సమానంగా చూడాలని, కుల వివక్ష పాటిస్తే తగిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. దుర్గమ్మ పండుగలో దళితుల బోనాలను అడ్డుకొని అంటరానితనం పాటించిన మర్కూక్ మండలం శివారు వెంకటాపూర్‌లో గురువారం ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు శంకర్, లక్ష్మీనారాయణ, రాము బాబునాయక్ పర్యటించారు. దళితవాడలోని ఎల్లమ గుడి వద్ద గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అధ్యక్షతన జరిగిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని బాధితుల ఆవేదనను విన్నారు. దుర్గమ్మ ఆలయంలో దళితులతో ప్రవేశించి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేయించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ శంకర్, ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై దామోదర్, తహసీల్దార్ అరీఫా, భాస్కర్, భిక్షపతి, కృష్ణ, కృష్ణమూర్తి, ఏగొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాల సందర్శన**

ములుగు, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బట్టి వెంకటయ్య సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత, తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు

మిరుదొడ్డి, ఆగస్టు 29 : రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తానని చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ ఎంపీపీ పోలీసు రాజులు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతులతో వ్యవసాయ అధికారులు ఫోన్‌లో సెల్ఫీ దిగితేనే రుణమాఫీ వర్తిస్తుందని చెప్పడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వచ్చిన సమయంలో రైతులు వ్యవసాయ పనులు చేసుకోవడానికి వెళ్తారు, మరి కొందరు బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు.. వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కొర్రీలు పెట్టకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ హైమద్, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు దారులతో మర్యాదగా వ్యవహరించాలి

పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న సీపీ డాక్టర్ అనురాధ

మిరుదొడ్డి, ఆగస్టు 29 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో పోలీసు సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ అన్నారు. గురువారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ కమలాకర్, మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు. ఐటీ సెల్ ఎస్సై నరేందర్ రెడ్డి, ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుల్స్ ప్రమోదు, సత్తయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తుది జాబితా ప్రక్రియ పూర్తి చేయాలి

- ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

సిద్దిపేట కలెక్టరేట్/సిద్దిపేట కమాన్, ఆగస్టు 29 : రాష్ట్రంలో లోకల్ బాడీస్ ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్, పోలింగ్ సిబ్బంది ఎంపిక, తుది ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పూర్తి చేయాలని న్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి సచివాలయంలో పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లోకేశ్ కుమార్, కమిషనర్ అనితారామచంద్రన్‌తో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా, గ్రామ పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే 4-5 నెలల్లో లోకల్ బాడీస్ ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు. ముందుగా గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ ఓటరు జాబితా తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లతో వేగంగా పూర్తి చేయించాలన్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారులు పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, ఎంపీఓ, డీఎల్పీ, డీపీఓ అధికారుల పనితీరును అదనపు కలెక్టర్ తరచూ పర్యవేక్షించాలన్నారు. ఓటరు జాబితా వంద శాతం పూర్తయ్యాక గ్రామ పంచాయతీల్లో ఆ గ్రామ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ప్రకటించి ఓటర్ల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్ ఎన్నికల సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, ఆర్డీవో సదానందం, డీపీవో దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

**ఆకస్మిక తనిఖీ**

సిద్దిపేట/మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 29: జిల్లాలోని పలు పాఠశాలలను గురువారం కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి జడ్పీ, ఖాజీపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. క్రీడా దినోత్సం సందర్భంగా నిర్వహించిన టూ కే రన్‌లో పాల్గొన్న భూంపల్లి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అ నంతరం మిరుదొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివా స్‌రెడ్డి, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎస్‌వో రామస్వామి, అధికా రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, ఆగస్టు 29 : అల్వాల గ్రామానికి చెందిన బాధితురాలు చెర్ల లావణ్య కుటుంబానికి గురువారం రూ.24 వేలు సీఎంఆర్ఆఫ్ చెక్కును బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ హైమద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు మల్లయ్య, రాజయ్య, బాబు, రంజిత్, రాజు పాల్గొన్నారు.

**జగదేవపూర్‌లో..**

జగదేవపూర్, ఆగస్టు 29 : మండలంలోని తీగుల్‌కు చెందిన సంతోశ్‌కు రూ.39 వేల సీఎం సహాయ నిధి చెక్కును పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కోటయ్య, సత్తయ్య, ఐలయ్య తదితరులు ఉన్నారు.

## గజ్వేల్‌లో వీధి కుక్కల పట్టివేత

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

అనిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుక్కలను పడుతున్న సభ్యులు

గజ్వేల్, ఆగస్టు 29: మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని నెలలుగా కుక్కల బెడద కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'హడలెత్తిస్తున్న కుక్కలు భౌ..భౌ' అంటూ గత నెలలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆయా వార్డుల్లో గురువారం కుక్కలను యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం పట్టుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దిన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## పెయ్య దూడల ఉత్పత్తి పథకంపై అవగాహన

మాట్లాడుతున్న డాక్టర్ రాంజీ

గజ్వేల్, ఆగస్టు 29 : గజ్వేల్ పరిధిలోని గోపాలమిత్ర, పశువైద్య సిబ్బందికి పెయ్య దూడల ఉత్పత్తి పథకంపై గురువారం అవగాహన కల్పించారు. గజ్వేల్‌లోని పశువైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమానికి పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి రాంజీ, గజ్వేల్ పశువైద్య సహాయ సంచాలకుడు రమేశ్‌బాబు హాజరై పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందని, కృత్రిమ గర్భాధారణ ద్వారా కేవలం ఆడ దూడల ఉత్పత్తితోనే రైతులకు ప్రయోజనం ఉంటుందనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే నెల 1 నుంచి రైతులను ఈ పథకంలో చేర్చుతామన్నారు.

## ఆత్మగౌరవ భవనాలను నిర్మించిన ఘనత హరీశ్‌రావుదే

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, ఆగస్టు 29 : పట్టణంలో అన్ని కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించిన ఘనత ఎమ్మెల్యే హరీశ్‌రావుదని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని 35వ వార్డులో స్థానిక కౌన్సిలర్ భూంపల్లి శ్రీలత-శ్రీహరిలతో కలిసి వీరశైవలింగ బలిజ సమాజం భవనం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్, సమాజం అధ్యక్షులు భద్రప్ప, ప్రశాంత్, శివప్ప, యాదగిరి, నాగరాజు, రాజమౌళి, వీరేశం, కోఆప్షన్ సభ్యులు సయ్యద్, మీర సత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు వజీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలు విడుదల చేయాలని ధర్నా

ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న విద్యార్థులు

గజ్వేల్, ఆగస్టు 29 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం గజ్వేల్ ఐవోసీ కార్యాలయం ఎదుట యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందన్నారు. రాష్ట్రంలో మార్పు తీసుకొస్తామని ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, మధు, సభ్యులు శేఖర్, ప్రవీణ్, యాదగిరి, రంజిత్, అరవింద్, కార్తీక్, వంశీ, సందీప్ లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

చేర్యాల, ఆగస్టు 29 : మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బైర ఐలవ్వ ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ పెడుతల అమరేందర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. తన సోదరుడైన మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి ద్వారా రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్, రవితేజ, రాజలింగం, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

మిరుదొడ్డి, ఆగస్టు 29 : పంట రుణమాఫీ కాని రైతుల నుంచి గురువారం మండల వ్యవసాయ అధికారి బోనాల మల్లేశం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 29: ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో వనమహోత్సవంలో భాగంగా ప్రజలతో కలిసి పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, వైస్‌చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ గూళ్ల రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వన మహోత్సవ సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారి వంశీ, ఆర్పీ సరళ ఉన్నారు.

## ఘనంగా తెలుగు భాషాదినోత్సవం

చేర్యాల : పద్యపఠన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల, ఆగస్టు 29 : మండలంలోని కడవేర్గు ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యపఠన, లేఖా రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బల్ల శ్రీనివాస్, తెలుగు భాషా పండితుడు కాంతి కృష్ణ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, రమేశ్, కృష్ణమూర్తి, లింగాచారి, రామకృష్ణ, మమత, సాజిదా, అరుణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

**కడవేర్గు ఉన్నత పాఠశాలలో..**

చేర్యాల, ఆగస్టు 29 : మండలంలోని కడవేర్గు ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పద్యపఠన, లేఖా రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు కాంతి కృష్ణ, చంద్రశేఖర్ రావు, రమేశ్, కృష్ణమూర్తి, లింగాచారి, రామకృష్ణ, మమత, సాజిదా, అరుణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

**పంచతంత్ర పాఠశాలలో..**

చేర్యాల పంచతంత్ర పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ శ్యామల సన్మానించారు.

**మహిళ డిగ్రీ కళాశాలలో..**

గజ్వేల్, ఆగస్టు 29: ప్రభుత్వ మహిళ డిగ్రీకళాశాలలో తెలుగు బాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించగా విద్యార్థులు ఉపన్యాసాలు, పాటలు పాడడం, నృత్యాలు చేయడంతో అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమల క్రిస్టియన్, అధ్యాపకులు ఉమారాణి, శ్రీలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 29 : మండల పరిధిలోని మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం వైభవంగా ఆర్ద్రా మహోత్సవం నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, మర్యాల రవీందర్, తిరుపతి రెడ్డి, రాజేంద్రప్రసాద్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో రామరాజుశర్మ కృషి ప్రశంసనీయం

వర్గల్, ఆగస్టు 29 : రామకోటి రచన, ఆధ్యాత్మిక సేవల్లో నిత్యం తరిస్తూ ఎందరో భక్తులకు ఆదర్శంగా నిలుస్తున్న గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజుశర్మ పంతులు సేవలు ఆదర్శనీయమని మండల పరిధిలోని చాంద్ ఖాన్‌మక్త గ్రామస్తులు తెలిపారు. గురువారం చాంద్‌మక్తలో భద్రాచలం నుంచి తెచ్చిన తలంబ్రాల పంపిణీ అనంతరం రామరాజుశర్మను గ్రామస్తులు సన్మానించారు. రామరాజు రెండున్నర దశాబ్దాలుగా దైవిక పరమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులను ఆకట్టుకోవడంతో పాటు కళారత్న, భక్తిరత్నం, సేవారత్న తదితర అవార్డులను సొంతం చేసుకున్నట్లు వారు తెలిపారు.

### ఘనంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవం

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 29 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో గాంధీ బొమ్మ సమీపంలోని వేపచెట్టు ఆంజనేయ స్వామి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్ కుమార్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

వర్గల్,ఆగస్టు 29 : గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని మాజీ ఎంపీపీ నిమ్మ రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నెంటూర్ విశ్వశాంతి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాల్లో జాతీయక్రీడాదినోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభను కనబరిచి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్యామలసాదుల్లా గౌడ్, ప్రిన్సిపాల్ దేవిదయాకర్, మాజీ ఉప సర్పంచ్ కొండల్‌గౌడ్, విద్యా కమిటీ మండల మాజీ చైర్మన్‌రాఘవరెడ్డి పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేత

గజ్వేల్, ఆగస్టు 29 : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరిస్ విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఫిబ్రవరిలో ఎ1 సర్టిఫికెట్ కోసం విద్యార్థులు పరీక్షలు రాయగా ఉత్తీర్ణులైన వారికి సికింద్రాబాద్ 2టీ బెటాలియన్ అధికారి ప్రదీప్‌సింగ్ సర్టిఫికెట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపపాల్ విజయపాల్, వైస్ ప్రిన్సిపపాల్ రవికుమార్, ఏఎన్‌వో అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**డిగ్రీ కళాశాలలో..**

సిద్దిపేట టౌన్, ఆగస్టు 29 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సమావేశ మందిరంలో గురువారం ప్రిన్సిపాల్ సునీత ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి భవాని, వైస్ ప్రిన్సిపల్ అయోధ్య రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### గంజాయి పట్టివేత

జగదేవ్‌పూర్. ఆగస్టు 29 : 3.323 కిలోల గంజాయితో పాటు నాలుగు బైకులను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోని తీసుకున్నామని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఎస్సై చంద్రమోహన్‌తో కలిపి విలేకరులతో మాట్లాడారు. గొల్లపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయిని తీసుకెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు బాలాజీనగర్‌కు చెందిన వెంకటేశ్, బాలాజీనగర్‌కు చెందిన సోడే, పోతిరెడ్డిపల్లికి చెందిన ప్రేమ్‌రాజ్‌ను అదుపులోకి తీసుకొన్నామన్నారు. వీరి వాహనాలను స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు.

## సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

కొమురవెల్లి, ఆగస్టు 29 : మత్స్యకార సభ్యులకు చేపల వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం గురువారం కొమురవెల్లిలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సౌజన్యంతో పకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ మాట్లాడుతూ.. చేపల వ్యర్థాలతో తయారు చేసిన సేంద్రియ ఎరువులతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ సార్ల కిష్టయ్య, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస భిక్షపతి, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య, కొమురవెల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మేడికుంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాశం స్వామి, కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో నారదాపు ఈశ్వర్ పాల్గొన్నారు.

### బీడీ కార్మికులకు నష్టం జరగకుండా చూస్తాం

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 29 : బీడీ కార్మికులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ అన్నారు. భాషా బీడీ కంపెనీని పూర్తిగా తొలిగిస్తారని ప్రచారం చేస్తున్న నేపథ్యంలో గురువారం బీడీ భాష కంపెనీ(సిద్దిపేట) యాజమాన్యంతో బీడీ కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్మికుల పెన్షన్ విధానం, సర్వీస్, రూల్స్, సర్వీస్ నిండకుండా ఉన్న కార్మికులను వేరే బీడీ కంపెనీకి ఫార్వర్డ్ చేసేలా వారి సర్వీస్ విషయాలపై చర్చించారు.

## మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ ప్రారంభం

రీసెర్చ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మెడికల్ డైరక్టర్ విమల థామస్

సిద్దిపేట, ఆగస్టు 29 : సిద్దిపేటలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డీహెచ్ఆర్, ఐసీఎంఆర్ నిధులతో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్‌ను గురువారం కళాశాల డైరక్టర్ విమలా థామస్, మెడికల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ ప్రాంభించారు. ఈ సందర్భంగా డైరక్టర్ విమలా థామస్ మాట్లాడుతూ.. ఈ యూనిట్ ప్రారంభంతో మెడికల్ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనలు జరిపేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నోడల్ అధికారి శైలజ, రీసెర్చ్ అడ్వైజరీ బోర్డు సభ్యులు అశ్విన్ దలాల్, హైదరాబాద్‌కు చెందిన సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్త బరద్వాజ్, సీసీఎంబీ శాస్త్రవేత్త ఉదయ్, ఎన్ఐఎన్ శాస్త్రవేత్త విజయ్ కుమార్, ప్రొఫెసర్ నాగమణి పాల్గొన్నారు.

### నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు

రాయపోల్ ఆగస్టు 29 : దౌల్తాబాద్ మండలంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల దౌల్తాబాద్, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల లింగరాజ్‌పల్లిలో ఈ నెల 30, 31 తేదీల్లో ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బండి నరసవ్వ తెలిపారు. పోటీల్లో అండర్-17, 14 బాల బాలికలందరూ పాల్గొనాలని కోరారు.

## సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

సిద్దిపేట, ఆగస్టు 29 : కేంద్రం తీసుకొచ్చిన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించాలని ఉద్యోగ ఐక్యకార్యాచరణ కమిటీ చైర్మన్ గ్యాదరి పరమేశ్వర్ తెలిపారు. స్థానిక పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ ఒకటిన ఆచార్యజయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ మీదుగా తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యోగులందరూ ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


కిషన్‌నాయక్ దంపతులను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 29: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ కట్టుబడి పనిచేస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణ శివారులోని శుభం గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం తంగళ్లపల్లిలో రూ.150కోట్లతో సమీకృత గురుకుల విద్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి, డీఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రావు, వాసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఏసీపీ సతీశ్, ఏడు మండలాల ఎంఈవో, హెచ్ఎంలు పాల్గొన్నారు.

**కిషన్‌నాయక్‌ను సన్మానం**

హుస్నాబాద్ పట్టణంలోని కేజేఆర్ గార్డెన్స్‌లో జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లావుడ్య కిషన్‌నాయక్ పదవీ విరమణ, వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ కిషన్‌నాయక్ దంపతులను ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఆశ్విత్‌కుమార్

సిద్దిపేట, ఆగస్టు 29 : సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఆశ్విత్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రసన్నరాణి బదిలీపై వరంగల్ వెళ్లడంతో జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న సంధ్యను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఆమె బాధ్యతలు చేపట్టకపోవడంతో ఇక్కడ మున్సిపల్ డీఈగా పనిచేస్తున్న ప్రేరణ పాండాను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. జీహెచ్ఎంసీలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హోదాలో ఉండి కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆశ్విత్‌కుమార్‌ను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. దీంతో పాటు సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

## ఘనంగా క్రీడా దినోత్సవం

జిల్లాలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- న్యూస్ నెట్‌వర్క్, సిద్దిపేట జిల్లా, ఆగస్టు 29

మర్కూక్: కేజీబీవీలో ధ్యాన్‌చంద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

చేర్యాల : ధ్యాన్‌చంద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

### డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 29 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు వ్యావహారిక భాషోద్యమ కర్త గిడుగు రామ్మూర్తి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి సంపత్‌కుమార్, అధ్యాపకులు దాసు, శైలజ, రామస్వామి, నరేశ్, నర్సింహులు విద్యార్థులు పాల్గొన్నారు.

### వాహనదారులకు కౌన్సెలింగ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 29 : నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారికి ట్రాఫిక్ పోలీసులు గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై గోపాల్‌రెడ్డి, ఏఎస్సై ఉమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారిణి ఎంపిక

సిద్దిపేట, ఆగస్టు 29 : అక్టోబర్ 14 నుంచి 19 వరకు తైపీలో జరుగనున్న 4వ ఆసియ విశ్వవిద్యాలయాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే భారత్ జట్టుకు జిల్లా క్రీడాకారిణి వైష్ణవి ఎంపికైందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం తెలిపారు. గత నెల ఔరంగబాద్‌లో జరిగిన జట్టు ఎంపిక పోటీల్లో వైష్ణమి ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఈ పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వైష్ణవికి ఆర్థికంగా నేతి కైలాసం రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రేణుక, తోట సతీశ్, హరి కిషన్, శ్యాం సుందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డు పరిశీలన

గజ్వేల్, ఆగస్టు 29: పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డును గురువారం ఆర్డీవో బన్సీలాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాధిక పరిశీలించారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల తయారీ విధానాన్ని మున్సిపల్ కమిషనర్ నర్సయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు కంట్రోల్ అధికారి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**హెచ్చరిక ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు అయిన కొమ్మెర రవీందర్ రెడ్డి మరియు కొమ్మెర రాజిరెడ్డి, ఇద్దరి తండ్రి: వెంకటరెడ్డి, నివాసము: కరీంనగర్ గార్లు సిద్దిపేట జిల్లా కోహెడ మండలము, గుండారెడ్డిపల్లి గ్రామములో ఉండబడిన వ్యవసాయ భూములు సర్వే నంబర్లు 294అ/1/1 మరియు 294అ/1/2 మొత్తము విస్తీర్ణము ఎ|| 2-14 గుంటలు గల దానికి సంపూర్ణ యజమానులు మరియు కబ్జాదారులు. ఇట్టి భూమిపై నాగిల్ల వెంకటరెడ్డి మరియు కొలాల జమున గార్లు నా క్లయింట్లు వ్యవసాయ పనులకు అడ్డురాగా కోర్టులో సివిల్ దావా OS No. 118/2024 జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, హుస్నాబాద్‌లో వేసి I.A. No. 267/2024 ద్వారా తేది. 3-7-2024 రోజున నా క్లయింట్లు ఇంజంక్షన్ ఆర్డరు పొందినారు. కాని ప్రతివాది అయిన నాగిల్ల వెంకటరెడ్డి S/o. మల్లారెడ్డి గారు భూమి సర్వేనంబరు 294అ/1 లో విస్తీర్ణము ఎ|| 2-14 గుంటలు తప్పుడు హద్దులతో సివిల్ దావాలో ఇంజంక్షన్ ఆర్డరు పొందిన భూమి యొక్క హద్దులు చూపిస్తూ నామమాత్రంగా ఒక రిజిస్ట్రేషన్ విక్రయ దస్తావేజు నంబరు 969/2024 తేది. 17-8-2024 నాడు జలిగం సాయిలు S/o. నర్సయ్య అనునతని ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వాస్తవంగా నాగిల్ల వెంకటరెడ్డికి సదరు దస్తావేజు ద్వారా ఏ విధమైన హక్కులు సంక్రమించలేదు. పైగా నాగిల్ల వెంకటరెడ్డి నా క్లయింట్లు ఇంజంక్షన్ ఆర్డరు పొంది కాస్తు, కబ్జాలో ఉన్న భూమిని తప్పుడు హద్దులతో ఇతరులను ప్రలోభపెట్టి విక్రయించాలని చూస్తున్నాడు. కావున ఎవరు కూడా సదరు భూమిని కొనుగోలు చేయకూడదని హెచ్చరించడమైనది. ఒకవేళ ఎవరైనా కొనుగోలు చేసినచో వ్యక్తిగతంగా బాధ్యులగుదురు.

ఇట్లు: సం/- బేతి హర్షవర్ధన్ రెడ్డి, న్యాయవాది
H.NO. 3-7-276, వావిలాలపల్లి, కరీంనగర్. సెల్: 90597 20100